దూద్‌బఖష్

గుప్పుమనే మంటతో పొయ్యి వెలిగింది. దొడ్లో వీస్తున్న గాలికి సవక్కట్టెలు చిరచిరలాడతా మండుతున్నాయి. ఎండ సెగ ముఖాన తగలతా ఉంటే నజీరత్త వచ్చి పొయ్యి ముందర కూచునింది.

'నువు పోయి లోపల కూచోపో అకా. నేను నీళ్ళు కాగబెడతా' అంది బషీరత్త పొయ్యి మీద ఇత్తడి గంగాళాన్ని పెడతా.

నజీతరత్త కదల్లా.

మోకాళ్ళు ముడుచుకుని మంటతట్టే చూస్తా ఉంది.

'పో అకా' అంది మళ్ళీ. నజీరత్త ఉలకనైనా ఉలకలా. బషీరత్తకు భయమేసింది.

తెల్లారి నుంచి నజీరత్త మాటాపలుకూ లాకుండా అట్నే ఉంది. ఒక ఏడుపు ఏడ్చిందీ లా. ఒకమాట పలికిందీ లా. మూగరాయాల బిగుసుకుపోయి కూచోనుంది. ఆమె కరిగి కన్నీళ్ళు బెట్టుకుంటే కడుపు కోత రొంతయినా చల్లారద్ది గదా అని అంతా చూస్తా ఉన్నారు.

నజీరత్త కరగట్లా.

'మోవ్! నీకే చెప్పేది' అంది బషీరత్త, అదిలించైనా చూద్దామని.

ఆ అదిలింపుకు అదురులో ఉన్న పసిబిడ్డాల ఇంకాస్త ముణగదీసుకుంది నజీరత్త. జబ్బ పటుకొని బలవంతంగా లేపబోతుంటే, 'రొంపసేపైనా ఈడ కూచోనీమ్మా బషీర్. నా బిడ్డకు ఆఖరుసారి నీళ్ళు కాగబెడతా ఉంటే నన్ను లాకుండా జేస్తావా' అంది ప్రాధేయపడుతూ.

ఆ మాటకు బషీరత్త కడుపులో నుంచి ఏడుపు పొర్లుకొచ్చింది.

'నువు ఈ వాటాన ఉంటే ఎట్టా అకా. వాడెట్టా పోయినాడు... నువు కూడా పోయేదానికి రెడీ అయినావా' అని లబలబా నెత్తి కొట్టుకుంటా కింద కూలబడింది.

బషీరత్త ఏడుపు విని పెదత్త దొడ్లోకొచ్చింది. పొర్లకింతలు పెడుతున్న బషీరత్తను చూసి ఆ ఏడుపుకు నజీరత్త ఏమైపోతుందో నన్న గాబరాతో కయ్యిన కసిరింది.

'చాల్లే గాని ఆపు మే. ఏందో సొంత కొడుకు పోయినట్టుగా శోకండాలు పెడుతున్నావే. ఇప్పుడేమైందనీ... వాడి టైమొచ్చిందీ ఎల్లిపోయినాడు. మనవంతా పోవాల్సినోళ్ళంగామా? లే లే ఇస్కూల్లో కెళ్ళి నాలుగు రేగాకులు దూసుకొద్దూ గానీ. చావు నీళ్ళు బోసే ముందు వేణ్ణీళ్ళలో రేగాకులు కలపాలి గదా' అంది. అన్నాక, బషీరత్తను ఆణ్ణుంచి అవతలికి పంపి నజీరత్త తట్టు తిరిగింది.

'నువ్వేందిమే ఈడ... ఇట్టా పడున్నావా? పోయి నీ కొడుకు దెగ్గిర కాసేపు కూచోరాదా? కంటినిండా చూసుకోరాదా? ఇంకాసేపు తాలితే కనపడమన్నా కనపడతాడా వాడు' అని గద్దించింది.

అంతలోనే తోడబుట్టిన దాని దీనావస్థకి తల్లడిల్లతా, 'లెయ్యే పిచ్చితల్లీ... లెయ్యమ్మా' అంటూ నజీరత్త ఒడిపట్టి ఇంట్లోకి పిలచకెళ్ళింది.

లోపల నులకమంచం మీద తూరుపు తట్టు తల పెట్టించి పడుకోబెట్టున్నారు షఫీగాడి శవాన్ని. తల పక్కన స్టీలు గ్లాసులో బియ్యం పోసి, అందులో గుప్పెడు సాంబ్రాణి కడ్డీలు గుచ్చున్నారు. ఇల్లంతా గంధపు పొగల వాసనతో నిండిపోయి ఉంది.

శవం చుట్టూ పెదత్త, బషీరత్త కూతుళ్ళూ, వాళ్ళ పిలకాయలూ మూగి కూచోనున్నారు. ఇరుగు పొరుగు ఆడోళ్లు, దూరపు బంధువుల్లో ఒకరిద్దరూ టీ గ్లాసులని పట్టుకొని తాగకుండా చూస్తా ఉన్నారు.

బయటి మొగోళ్ళు వచ్చినప్పుడల్లా కఫన్ తొలగించి కడ చూపులు

చూపిస్తున్న షమీమ్ ఆపా షఫీగాడి మొఖాన్ని చూసే కొద్దీ ఇంకాస్త ఏడస్తానే ఉంది.

'చేతులారా నిన్ను పోంగొట్టుకున్నాం గదరా నాయనా. ఇంకే బరోసాతో బతకబోయేదిరా తండ్రీ' అని తరస్తా ఉంది.

ఆమె వాడి కంటే ముందు నజీరత్తకు పుట్టింది. నజీరత్త తరువాత నజీరత్తయ్యి షఫీగాణ్ణి చిన్నప్పట్నించి సాకి సంతరించింది. చేతుల్లో పెరిగి ఎదిగినోడు కళ్ళ ముందరే కాటికి పోబోతా ఉన్నాడంటే ఆరాయించుకోలాకపోతా ఉంది.

'ఊరుకోమ్మే ఊరుకో. నువ్వే ఇట్టయిపోతే చిన్నదేమైపోవాలా? ధైర్యం పెట్టు. దేవుడి మీద బరోసా పెట్టి ముందా అమ్మిని లేపు' అంది పెదత్త, సల్మా తట్టు చూపిస్తా.

పొద్దుటి నుంచి ఏడ్చీ ఏడ్చీ సోషొచ్చి పడిపోయి ఉంది సల్మా. ఊపిరిపోయే ముందు 'సల్మా... సల్మా' అంటా చెల్లెల్ని కలవరించాడంట షఫీగాడు. ఊపిరి పోయాక వచ్చిన ఆ అమ్మికి ఆ సంగతి తెలిసిపోయింది. ఇంకంతే. స్వాధీనం తప్పిపోయింది.

'షఫీ... ఒరే... నీ కడమాటలు వినలేకపోతినే. నేనెంత కర్మురాలినే. ఏమి చెప్పాలనుకున్నావో గదారే' అని పలవరింతలు మొదలు పెట్టింది.

ఆరు నెలల కిందట పెళ్ళి చేసి పంపిన అన్న అంతలోనే శవమవుతాడని ఆ అమ్మి కలైనా కనుండలేదు. ఏ అచ్చటకైనా ఏ ముచ్చటకైనా నేనుండానంటా వచ్చే అన్న ఇంక లేడన్నమాట ఆ అమ్మి తలకెక్కడం లేదు. ఒకోసారి ప్రేలాపిస్తా ఉంది. ఒకోసారి సోషొచ్చి పడిపోతా ఉంది. ఇదంతా చూస్తే ముసలాయన అలివికాడని షఫీవాళ్ళ నాయనని ఆయన స్నేహితులు ఇంట్లో ఉంచలేదు. నేరుగా తీసికెళ్ళి టీకొట్టు దెగ్గిర కూచోబెట్టుకున్నారు. ఆ మాటా ఈ మాటా చెప్తా ఆయన్ను మామూలు మనిషిని చేయడానికి అవస్థపడతా ఉన్నారు.

కాసేపటికి రిక్షాలో జనాజాని పెట్టుకొని వచ్చాడు బషీరత్త భర్త. రావడంతోనే దాన్ని కడిగే పనిని బయటున్న పిలకాయలకు ఒప్పజెప్పి నేరుగా ఇంట్లోకి వచ్చాడు.

'మోవ్! టైము మూడవతా ఉంది. అయిదు గంటల నమాజు లోపల శవాన్ని మసీదు కాడికి చేర్చాలి. ఆనేక ఖబరస్తాన్‌కు మోయాలి. ఇప్పట్నించి మొదులుబెడితే కదా. చావు నీళ్ళకి సిద్ధం చేసినారా' అన్నాడు.

ఆ మాటలకి సన్నగా ఏడుస్తున్న వాళ్ళంతా గొంతు పెంచేసినారు.

'అయ్యో నా బిడ్డా. నీకప్పుడే వేళయిపోయిందా నాయనా' అని అరచేతులు చరస్తా ఏడ్చింది షమీమ్ ఆపా.

పెదత్త లేచి బషీరత్త భర్తని పక్కకి తీసికెళ్ళింది.

'అప్పుడే ఏమి తొందర? కాసేపు తాలరాదా' అంది ఆయనతో.

'దేనికి' అన్నాడాయన.

'జీనత్ రాబళ్ళా? అక్క రాకుండా తమ్ముణ్ణి మట్టిట్టజేస్తారు' అంది.

ఆయన నెత్తి కొట్టుకున్నాడు.

'సరే కానీయండి. నేను పోయి ఖబర్ సరిగ్గా తవ్వినారో లేదో చూసుకొని వస్తా' అని వెళ్ళిపోయినాడు.

టైము మూడున్నర నాలుగయ్యేటప్పటికి రావలసినోళ్ళంతా వచ్చేశారు. రామాయపట్నం బంధువులు, నెల్లూరు బంధువులు, రాపూర్లో ఉండేవాళ్ళు అందరూ కడచూపులకు దిగబడ్డారు. ఇంక జీనత్‌దే ఆలస్యం.

నజీరత్త నడిమి కూతురు జీనత్. షమీమ్ ఆపాకూ షఫీగాడికీ మధ్యన పుట్టిందది. బెడవాడలో ఇచ్చి వేశారా అమ్మిని. దాని మొగుడు ఐస్ ఫ్యాక్టరీలో పని చేస్తాడు.

పొద్దున తొమ్మిదింటికి షఫీగాడి ప్రాణాలు పోంగానే బెజవాడకు ఫోను చేసి, ఫ్యాక్టరీ వాళ్ళకు చెప్పి, వెంటనే బయలుదేరమని కబురు చేశారు జీనత్‌కు. చార్జీలకు డబ్బులు చూసుకొని ఎంత గబుక్కున బయలుదేరినా బెజవాడ నుంచి కావలి రావడానికి అయిదు గంటలు పడుతుంది. ఆ లెక్కన ఇప్పుడో ఇంకా సేపట్లోనో జీనత్ రాబోతా ఉందని అంతా చూస్తా ఉన్నారు.

'సింగరాయకొండ దగ్గిర ట్రాఫిక్ జాము లేదంటలే. వచ్చేస్తది' అంటా వచ్చినాడు బషీరత్త కొడుకు రియాజు, బజారు నుంచి తెచ్చిన పూలబుట్టను కిందకి దించతా.

ఆ బుట్టలో మల్లెపూలు కారబ్బంతి కలిపి అల్లిన పూలకఫన్ ఉంది. జనాజాలోకి ఎక్కించినాక శవం మీద అలంకరించాలి దాన్ని. పెళ్ళి కుదిరితే పూల సెహెరా తొడుక్కోవాల్సిన వయసు షఫీగాడిది. దానికి బదులుగా దీన్ని తొడుక్కోబోతా ఉన్నాడు.

ఆ కఫన్‌ని చూసి, దగ్గిరపడుతున్న టైమును చూసి, వచ్చిన ఏడుపు

దిగమింగుకుంటా 'ఎందుకైనా మంచిది. ఎవరో ఒకరు బస్టాండ్‌కాడికి పోయిరా పోంౢ్రా' అంది పెదత్త, జీనత్ కోసం చూసిరావడానికని. ఆమె ఆ మాట అంటుండగానే వాకిట్లో రిక్షా ఆగింది.

'అదిగో వచ్చింది' అన్నారెవరో.

జీనత్‌ని చూడగానే ఆడోళ్ళంతా గొల్లున ఏడుపందుకున్నారు. చెల్లెల్ని కావలించుకుందామని షమీమ్ ఆపా లేచి నిలబడింది.

'మాయ్ జీనత్. చూద్దూగానీ రా' అని ఎదురుపోయింది బషీరత్త.

దారిపొడుగునా ఎంత ఏడ్చుకుందో ఎన్నిమార్లు గండెలు బాదుకుందో గాని తమ్ముడి శవాన్ని చూడగానే పసిపిల్లాల కిందబడి గిలగిలమని తన్నుకుంది జీనత్. గాజులు పగిలేలా తలబాదుకుంటా 'ఎంత పని చేశావురా షఫీ' అని అల్లల్లాడిపోయింది.

కాసేపటికి స్తిమితపడి, 'అసలెట్టా జరిగింది' అంది కళ్ళు తుడుచుకుంటా.

'టీబీ అంటమ్మా. ఆ నా కొడుకు ఎవురితోనూ చెప్పుకోలా. ఎవురికీ తెలీనీలా' అంది పెదత్త.

'ఏందో ఈక్‌నెస్ వల్ల పొద్దస్తమానం దగ్గతా ఉన్నాళ్ళే అని మీ అమ్మ తాత్సారం చేసిందిగాని ఇంత పని జరగద్దనుకోలా తల్లీ' అంది బషీరత్త.

ఆ మాటలు వినగానే జీనత్ దుఃఖం కడుపు మంటగా మారింది.

'ఈ నజీరమ్మ బుద్ధి నాశినంగానూ. ఈ మహాతల్లిని మట్టిలో పెట్టి కప్పెట్ట. బిడ్డలకొచ్చే రోగాలని మందులు తినిపించో మంచి చోట చూపించో నయం చేయించుకునే రాత ఈ తల్లికి ఆ దేవుడు రాయలేదు కదా. తెచ్చింది కడుపుకు మెక్కితే సరిపోతుందా? డాక్టర్లకు పెట్టబళ్ళా? ఆస్పత్రులకు తిప్పబళ్ళా? ఆ ఆకూ ఈ ఆకూ నమిలిచ్చి కంపోడర్లు రాసిచ్చే మాతర్లు మింగిచ్చి పోయే ప్రాణాలని నిలబెట్టెయ్యాలనుకుంటే సాధ్యమా? అట్టా చెయ్యాలని చూసే ఈ మనిషికి పుట్టగతులుంటాయా' అని శాపనార్థాలు మొదలుపెట్టింది.

'అట్టా మాట్లాడబాకు మే జీనత్. రోగం బయటపడేటప్పటికే కత చేయి దాటిపోయింది. అప్పటికే చేయాల్సిందంతా చేశాం... దారబోయాల్సిందంతా దారబోశాం. పాపం మీ అమ్మ... కంటికి రెప్పాల నీ తమ్ముణ్ణి చూసుకొనింది. రోగం కత ముందే తెలిసుంటే ప్రాణాలు అడ్డమేసుండేది కదా' అంది పెదత్త.

జీనత్ తలదిప్పి నజీరత్త తట్టు చూసింది. కూతురికి మొకం చూపించలాక తలదించేసుకుందామె.

'ఏందీ... ఈ మనిషా? మా అమ్మ సంగతి నాకు చెప్పబాకండి. మా ఇంట్లో పుల్లు మందుచీటీని ఏనాడు తేనిచ్చిందనీ? పది రూపాయలకు ఎన్నొస్తే అన్నేనే. టెస్టులు బస్టులు చేయించి చస్తే గదా' అంది జీనత్.

'టెస్టులంటే తేరకున్నాయంటమ్మే. వేలకు వేలు లాగతా ఉన్నారు. వాటికి మోటుకోవడం మనబోటోళ్ళకు అయ్యేపనేనా' అంది పెదత్త.

'అయితే మటుకు... ఈ నజీరక్కది మరీ చోద్యం లేమ్మా. జబ్బు ముదిరినాక కూడా వాణ్ణి పట్టించుకుంటే గదా... వాడి ఒళ్ళును వాణ్ణి చూసుకోనిస్తే కదా. ఇంటికి రావడమే ఆలస్యం. దానిక్కావాలి దీనిక్కావాలి అని జేబులు పెరుక్కునేదే పనాయే. వాడు ఇల్లు చూసుకుంటాడా? మందు చూసుకుంటాడా' అంది బషీరత్త.

'నజీరమ్మకు చెప్పలేదు కానీ నాకు నెల కిందే పక్కాగా తెలిసిపోయింది వాడికి టీబీ ఉందని. అప్పటికీ జెప్పా... రే షఫీ, ఎవ్వరికీ చెప్పాల్సిన పన్లా. నేరుగా పోయి మదనపల్లిలో చేరిపో చేర్చేసుకుంటారు. రెండు నెల్లు ఉన్నావంటే రోగం దారికొచ్చేస్తది. డబ్బులు ఎట్లోకట్ట చేద్దాం అని. వాడు వింటేగా. ఇంటి దెగ్గిర కష్టం లేరా అని మానేసినాడు' అన్నాడు రియాజు.

'మదనపల్లి దాకా ఎందకురా నాయనా. ఇట్టాంటి రోగానికి ఇంటికాడ కూచుంటే చాలదా. యాడా... ఈ మనిషి కూచోనిస్తే కదా. పనికి నాగా పెట్టి వాడు ఏ రోజు పొణుకున్నా ఎంటబడి ప్రాణాలు తీసినే. అంతెందుకా? జబ్బు ముదిరి ఈడిట్టా ఉంటే మందులూ మాకులూ అవతల పారేసి కనుమూరు దర్గాకి తీసకపోయిందంటే ఇంకేమి చెప్పేది? అక్కడ మూడు నిద్దర్లు చేసొచ్చినాక పూర్తిగా అడ్డం పడిపోయినాడు. పైకి లేవకుండా అట్టే పోయినాడు' అంది బషీరత్త.

'అదీ సంగతి. నాకు తెలుసు. మా అమ్మ గుండెలు తీసిన బొంటు. రోగాన ఉన్నోణ్ణి నీడ పట్టున ఉంచక నెమ్మ్మ రోజుల్లో కసుమూర్లకీ, రహమతాబాద్లకీ తిప్పుంటుంది. దెబ్బకు అయిపోయినాడు. లాకుంటే నాల్రోజులు బతికేవాడే' అని ఏడ్చింది జీనత్.

ఇందరు ఇన్ని మాటలు అంటా ఉన్నా నోరు తెరచి ఒక్కమాట కూడా బదులు చెప్పలేదు నజీరత్త. తలదించుకునే కూచునింది. ఇంతలో బషీరత్త భర్త మళ్లా వచ్చినాడు. ఈసారి ఆయనతో పాటు నలుగురు మసీదు మనుషులూ

ఉన్నారు.

'టైమైంది. నీళ్ళు పొయ్యాలి మే' అన్నాడు.

ఆడోళ్ళంతా గబగబా లేచి పక్కకు జరిగారు. వచ్చిన నలుగురు మనుషుల్లో అటిద్దరు ఇటిద్దరు చేరి శవాన్ని దొడ్లోని చెక్కబల్ల మీద పొణుకోబెట్టారు. నీళ్ళు పొయ్యడాన్ని ఆడోళ్ళు చూడకుండా ఉండేందుకు దుప్పట్లని అడ్డం కట్టారు.

ఇదంతా చూసి షమీమ్‌ఆపా, జీనత్‌లు శోకండాలు తీస్తుంటే నజీరత్త వడివడిగా బషీరత్త భర్తకాడికి వచ్చింది.

'ఏంది' అన్నాడాయన నజీరత్తను చూసి.

నజీరత్త భయపడతా భయపడతా చెప్పింది.

'వాడికి మసలే మసలే నీళ్ళుబోసుకునే అలవాటు లేదు నాయనా. కాస్త గోరువెచ్చటి నీళ్ళు బోయండి' అంది వేడుకుంటున్నట్లుగా.

బషీరత్త భర్త కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

'అట్నే' అన్నాడు.

రేగాకులు కలిపిన వేడినీళ్ళతో రివాజు ప్రకారం స్నానం చేయిస్తున్నారు షఫీగాడికి. కొయ్యబల్ల మీద ఎండుకుపోయిన వాడి ఒంటిని చూస్తుంటే అక్కడున్నోళ్ళెవరికీ ఏడుపు ఆగడంలా. చెంబుతో నీళ్ళు కుమ్మరించినప్పుడల్లా ఛాతీ మీద కదులుతున్న తావీజులాగా వాడు కూడా లేచి కూచుంటే బాగుండనిపిస్తోంది వాణ్ణి చూస్తోంటే.

'వీళ్ళ నాయన్ని పిలవండి. ఆయనొచ్చి చెంబెడు నీళ్ళు పోయాలి' అన్నాడు బషీరత్త భర్త.

అప్పటికే నజీరత్త భర్త పిచ్చోడాల ఈదంతా కలతిరుగుతున్నాడు. ఈ... అని పళ్ళు బిగబట్టి పిచ్చి ఏడుపు ఏడుస్తున్నాడు. నీళ్ళు బోయడానికి 'రాను రాను' అన్నట్టుగా ఆయన చేతులు అడ్డంగా ఊపుతుంటే, రియాజు వెళ్ళి నడుము మీద చెయ్యేసి పట్టుకొని దొడ్లోకి తీసుకొచ్చాడు.

నీళ్ళు ముంచిచ్చిన చెంబును పటుకొని, ముందుకొచ్చి, షఫీగాడి శవాన్ని చూడగానే తాప్పున కిందకొదిలేసి, 'రే షఫీ... ఎట్టరా మేం బతకబోయేది' అని కూలబడిపోయాడాయన. వెంటనే బయటికి తీసుకొచ్చేసినా సంబాళించుకోవడం ఆయన వల్ల కావడంలా. శరీరం వణికిపోతా ఉంది.

ఒకప్పుడు ఈ పక్క కుటుంబాల్లోగాని ఆ పక్క కుటుంబాల్లోగాని అందరి కంటే దయిర్యస్తుడిగా ఉండి ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానని ఆదుకున్న మనిషాయన. అందరి ఆస్తులు కరిగిపోయినాక కూడా ఆయన చేతిలో అయిదెకరాల భూమి ఉండేది. పడకండపాడు నుంచి కావలికి కాపరం మార్చినా యవసాయం ఒదులుకోకుండా మహరాజల్లే బతకతా ఉండేవాడు.

ఒక తడవ ఏం కరువొచ్చిందో ఏమోగానీ ఆయనేసిన పొగాకు సరిగా పండలా. ఆకు ఎదగలా. మోచెయ్యంత పొడుగుండే కాడే చివరికి దక్కింది. దాన్ని బోర్డు కొనలా. ఒక్క యాపారస్తుడూ వాసన చూళ్ళా. ఆడ పడింది దెబ్బ. ఇంకాణ్ణుంచి తేరుకోలేక పోయినాడు. యవసాయంలో అప్పులకి షమీమ్ జీనత్‌ల పెళ్ళిళ్ళకి పొలం ఖర్చయిపోయి షఫీగాడు ఎదిగొచ్చేటప్పటికి పూర్తిగా దివాలా తీశాడు. ఒంట్లో సత్తవ లేని ఇంకో పని చేతగాని ఆ మనిషిని చూసి పద్నాలుగేళ్ళకే పనిలో పడ్డాడు షఫీగాడు.

అప్పట్నించి కుటుంబానికి వాడే పెద్ద దిక్కు.

వాడు తెస్తేనే తినడం. లాకుంటే గమ్మున పొణుకోవడం. అట్టా గమ్మున పడుకోబెట్టలాక చిన్నోడైనా పెద్ద పనులెన్నో నేర్చినాడు షఫీగాడు. చెప్పుల షాపులో గుమాస్తాగా చేరి అందులో మెలకువలన్నీ నేర్చుకొని వచ్చే ఆదాయం చూసి ఉద్యోగం మానేసినాడు. ఇరవైవేల చీటీ పాడి,బెజవాడ నుంచి స్టాకు తెచ్చి పల్లెలకి వేయడం మొదలు పెట్టినాడు. అందులో ఆదాయం కనిపించాక ఊర్లు తిరగడం ఎక్కువ చేసినాడు. అట్టా తిరిగీ తిరిగీ కావలి చుట్టుపక్కల ఊళ్ళలో 'చెప్పుల షఫీ'గా పేరు తెచ్చుకున్నాడుగాని దానితో పాటు టీబీని కూడా తెచ్చుకున్నాడు.

అయితే బయటికి చెప్పలా. కూడబెట్టిన నాలుగు డబ్బులతో పని మానేసి కొన్నాళ్ళలో కుదురుకుందామనుకున్నాడుగాని ఇంతలో సల్మా పెళ్ళి కుదిరింది.

'నాయన్నాయనా... పిల్ల పెళ్ళి కాస్త జరిపిస్తే' అంటా వాడి వెంట పడింది నజీరత్త.

మంచి సంబంధం. వాయిదా వేయలేని బాధ్యత. రంగంలోకి దూకినాడు షఫీ. కట్నం కోసం కానుకల కోసం ఆడదెచ్చి ఈడదెచ్చి పల్లెల నుంచి వసూళ్ళు చేసి యాభై వేల చీటి పాడి ఆ పని కూడా పూర్తి చేశాడు. పెళ్ళయితే జరిగిపోయింది గాని ఆ గొడవలో వాడి ఒళ్ళు పూర్తిగా దెబ్బతినిపోయింది. ఒక తట్టు ఇంటి జరుగుబాటుకీ మరో తట్టు పెళ్ళి అప్పులకీ ఇంకా తిరుగుళ్ళు పెంచినాడు. ఒకోసారి తిరగలాక జ్వరం కాసి ఎప్పుడైనా పనికి పోకుండా పొణుకుంటే వాడి వెంటబడి

నజీరత్త తరమతా ఉండేది.

'ఆ అప్పులు కాస్తా తీరిపోనీ నాయనా. మళ్ళా నువ్వు హాయిగా నిద్రపోదూ గానీ' అని బతిమిలాడేది.

ఆమె కోరుకున్నట్టే ఆ అప్పులు తీరిపోయినాయి. వాడు హాయిగా పడి నిద్రపోయినాడు, మళ్ళా లేవకుండా.

చావు నీళ్ళు పోయడం పూర్తయింది. శవాన్ని లోపలికి తీసుకొొచ్చి ఈతాకు చాపమీద పడుకోబెట్టారు.

జనాజాలోకి ఎక్కించే ముందు కళ్ళకు సుర్మా రాసి, పక్కలో కర్పూరం పొడి రుద్ది, పైన అత్తరు పూసి, గులాబ్ నీళ్ళు చల్లి ముస్తాబు చేస్తుంటే ఏడుపు మొదలెట్టారు ఆడోళ్ళంతా.

'పెళ్ళికొడుకాల తయారవతా ఉన్నావా నాయనా. ఖబరస్తాన్ పోబోతా ఉన్నావా తండ్రీ' పెదత్త ఏడస్తా ఉంటే అందరి ఏడుపూ కలగలిసింది.

ఆ గోలకి తాళలేక 'ఆపండి మే' అని గావుకేక వేసి అందర్నీ కంట్రోలు చేసినాడు బషీరత్త భర్త.

'ఇప్పుడేడిస్తే వచ్చేదుందా? లేచేదుందా? జరగండట్టా' అని నజీరత్తని దగ్గరకి పిలిచినాడు.

ఆమె కదలకపోయేసరికి లాక్కొొచ్చి శవం కాడ నిలబెట్టినాడు.

'కానిమ్మా' అన్నాడు ఒక మసీదు మనిషి.

నజీరత్త ఎతిమతంగా చూసింది అర్థంగాక.

'అట్టా చూస్తావేందమ్మా. గబాల్నగాని. నీ బిడ్డకి పాలబిక్ష పెట్టాలి గదా' అన్నాడు.

ఆ మాట వినేసరికి ఆమె చేయాల్సిన పని గుర్తొచ్చేసరికి... అప్పుడు ఏడ్చింది నజీరత్త. ఒళ్ళంతా నీలుక్కుపోతా ఉంటే పిట్టంత మనిషి నిలువెల్లా వణికిపోతా వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ ఏడుపులోనే తల అడ్డంగా ఊపతా 'పెట్టలేను నాయనా పెట్టలేను' అంది.

అందరూ బిత్తరపోయారు. ఏడుపు ఆపేసి నజీరత్త తట్టు వెర్రిగా చూశారు.

'సాల్లేగానీ ఆపు మే. పాలబిక్ష పెట్టనంటే ఎట్టా కుదరద్దీ? తొరగా పెట్టు.

అవతల టయిమవతా ఉంది' అంది పెదత్త.

'నువ్వు పెట్టకుంటే నీ కొడుక్కి పైలోకంలో మోక్షం లేదే ముండదానా' బషీరత్త తిట్టింది.

'కానీ మా. ఈ టైములో హటం చేస్తారా ఎవురైనా' అంది షమీమ్ ఆపా నజీరత్తని సముదాయిస్తా.

అందరి మాటలకీ తల అడ్డంగా ఊపుతుందేగాని నజీరత్త కదలడంలా. ఆమె వాటం చూసి అందరూ చేష్టలు మాని నిలబడిపోయారు. ఎందుకనంటే, ఆమె పాలభిక్ష పెట్టకుంటే శవాన్ని ఎత్తేదానికి లా. మట్టి చేసేదానికి లా.

తొంభై తొమ్మిది రక్తపుచుక్కలు కలిస్తే ఒక పాల చుక్క అవద్దనీ అట్టాంటి పాలచుక్కలెన్నిట్నో కుడిపి బిడ్డల్ని పెద్ద చేస్తుంది గనక ఆ తల్లి రుణం ఆ బిడ్డ ఎన్నటికీ తీర్చుకోలేడని చెప్పే ధర్మంలో షఫీగాడు పుట్టాడు. అందుకని వాడు నజీరత్తకి రుణపడి ఉన్నాడు. సచ్చినా బతికినా ఆ రుణం నుంచి బయటపడడం వాడి చేతుల్లో లేదు. నజీరత్త చేతుల్లో ఉంది. ఆమె పెట్టబోయే దూద్‌బఖష్‌లో ఉంది.

ఆమెకై ఆమె ముందుకొచ్చి 'నాయనా... నేను నీకు పాలు కుడిపే పెద్దవాణ్ణి చేశాను. నువు నా పాలు తాగి రుణపడి ఉన్నావు. నా ధర్మాన నేను పోకముందరే నీ కర్మాన నువు పోయినావు గనక ఇదిగో ఈ నలుగురు మనుషుల ఎదట నేను నా మనసు నిండుగా నీకు పాలభిక్ష పెడతా ఉన్నా. నా పాలు తాగిన రుణం ఇయ్యాలితో చెల్లిపోతా ఉంది' అని చెప్పాలి.

అలా చెబితేనే వాడికి పైలోకాల్లో ముక్తి, శాంతి.

బతికుండగా కొట్టినా తిట్టినా కూడు పెట్టకుండా మలమలమని మాడ్చినా ప్రాణాలు పోయిన కొడుకును చూసి ఏ తల్లయినా పాలభిక్ష పెట్టేస్తుంది పెట్టెయ్యాలి కూడా. అందరికీ అలా పెట్టెయ్యడమే తెలుసు. నజీరత్తలాగా అడ్డం తిరుక్కున్నోళ్ళనీ ఎవురూ చూళ్ళా. అందుకని ఎవరికీ ఏమీ పాలుబోవట్లా.

కొడుకు శవాన్ని పట్టుకొని తడిమి తడిమి ఏడుస్తున్న నజీరత్తని అందరూ బతిమాలగలుగుతున్నారేగాని ఎవరూ బెదిరించలేకపోతా ఉన్నారు.

'ఏమ్మే ఇంకనైనా వింటావా వినవా' అని చూసింది పెదత్త.

ఇంక లాభం లేదనుకుని 'రే అబయా. పోయి వాళ్ళాయన్ని పిలచకరా

పో. ఆ మనిషి మాట తప్పితే ఇంకెవురి మాటా వినదిది' అందామె రియాజుతో.

అప్పటికే ఆ సంగతి బయటికి తెలిసినట్టుంది. నజీరత్త భర్తే లోపలి కొచ్చేశాడు. ఆయన్ని చూడ్డంతోటే గబాల్న వచ్చి వాటేసుకుంది నజీరత్త.

'చూడయా. నేను అన్యాయమైపోయానయా. దిక్కులేని దాన్నయి పోయానయా. చేతులారా నా బిడ్డను చంపుకున్నానయా' అంటా విలవిలలాడింది.

ఆమె ఏడుపు చూసి ఆయన కూడా ఏడ్చేసినాడు.

'ఊరుకోమ్మే ఊరుకో. ముందే తెలిస్తే ఇట్టా జరగనిచ్చుండేవాళ్ళమా. ఇప్పుడనుకొని ఏమి లాభం. జరగాల్సిన పని చూడు. మన బిడ్డకి పాలబిక్ష పెట్టెయ్' అన్నాడు మూసుకుపోయిన గొంతుతో.

నజీరత్త ఆయన చొక్కాని ఆసరాగా పట్టుకుంటా, 'నేను చేయలేనయా. నన్ను మన్నించయా' అని ఏడ్చింది.

'ఎందుకని మే' అన్నాడాయన అనునయిస్తా.

'నాకు తెలుసయా. నా బిడ్డకి టీబీ ఉందని ముందే తెలుసు. ఏం చేసేది చెప్పు. ఒళ్ళు బాగాలేదు మా. మదనపల్లికి పోయి రెండు నెలలు ఉండేసొస్తాను మా అని నా బిడ్డ బతిమిలాడుకుంటే నువు లాకుంటే ఇల్లు నడవదు నాయనా అప్పులోళ్ళు మమ్మల్ని బతకనీయరు నాయనా అని కాళ్ళు కట్టేసిన పాపిష్టి దాన్ని. ఇయ్యాల ఈళ్ళు ఇన్నేసి మాటలు అంటుండారే ఒక్కరైనా నా కూతురి పెళ్ళికి సాయం చేసినారా? రే షఫీ ఇదుంచు అని నయా పైసైనా వాడి చేతిలో పెట్టినారా? వాడు లాకుంటే నిన్నూ నన్నూ తీసెకెళ్ళి రెండు దినాలు ఇంట్లో పెట్టుకొని తిండి పెట్టే గతి ఈళ్ళలో ఎవురికైనా ఉందా? మందులకు గతిలాక ఆపరేషన్‌లకు డబ్బులాక కడకు ఆ దేవుడే దిక్కు అని దర్గాల మీద భారం వేశానుగాని నా బిడ్డను చంపుకునేదానికి కాదయా. పదారేళ్ళ పిల్లోడప్పటి కాణ్ణుంచి వాడి రెక్కల కష్టం తిని వాడి రక్తం తాగి వాడి ఎముకలు జుర్రి వాడి ప్రాణాలనే కాజేసిన నేను వాడి కడుపున వెయ్యిసార్లు పుట్టినా తీర్చుకోలేనంత రుణపడిపోయి ఉంటే వాడు నాకు రుణపడి ఉండటం ఏందయా. ఇదేమి లెక్కయా' అని నజీరత్త కన్నీళ్ళలో తడిసి పోతా ఉంటే ఆ దుఃఖం తీరేదెట్టా? శవం కదిలేదెట్టా?

ఇండియా టుడే ప్రత్యేక సాహిత్య సంచిక 2000
మరాఠీలో అనువదితం 2005
హిందీలో అనువదితం 2010
A mothers debt, Muse India - 2010